ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29 : ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చూడాలని కలెక్టర్ రాహుల్‌శర్మ మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాలు ప్రబలకుండా మండల ప్రత్యేక అధికారులు వైద్య సేవలను పర్యవేక్షించాలన్నారు. జ్వర పీడితులు ఎక్కువగా ఉండే గ్రామాలను గుర్తించి వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలని సూచించారు. వసతి గృహాల్లో సోలార్, ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని గతంలో జరిగిన సమావేశంలో ఆదేశించినా ఒక్కరూ ప్రతిపాదనలు ఇవ్వలేదన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా ప్రత్యేకాధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరిగిన పనులకు ఎంబీ ఆధారంగా బిల్లుల చెల్లింపునకు నిధులు మంజూరు చేస్తామన్నారు. జిల్లాలో 265 పాఠశాలల్లో పనులు చేపట్టగా 182 పాఠశాలల్లో పూర్తయ్యాయని, 83 పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నట్లు వివరించారు. ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు బిల్లుల చెల్లింపులో జాప్యంలేకుండా చూడాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో వారం రోజుల్లో మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. చెల్పూర్‌లో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లు లేని కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణం కూడా చేపట్టాలన్నారు. అలాగే హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పార్థసారథి గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణలో భాగంగా కలెక్టర్లుతో వీసీ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ రాహుల్‌శర్మ హాజరై మాట్లాడారు. జిల్లాలో 248 గ్రామ పంచాయతీలు, 2,092 వార్డులున్నాయన్నారు. వచ్చే నెల 6న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించాల్సి ఉందని, అందువల్ల గ్రామ పంచాయతీ వార్డుల వారీగా కుటుంబ సభ్యుల ఓటర్లన్నీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా ఓటరు జాబితా మెర్జింగ్ అవుతున్నట్లు చెప్పారు. టీఈ పోల్ సాఫ్ట్‌వేర్‌లో మెర్జింగ్ జరుగుతున్నదని, 50 శాతం వరకు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన 50 శాతం రెండు రోజుల్లో పూర్తిచేస్తామన్నారు. సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. జాబితాపై సెప్టెంబర్ 7 నుంచి 13వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. 9న గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి సూచనలు, సలహాలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరావు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, ఆర్డీవో మంగీలాల్, ఇతర అధికారులు హాజరయ్యారు.

నేడు దేవాదుల ప్రాజెక్ట్‌ను సందర్శించనున్న మంత్రులు

ములుగు, ఆగస్టు29 (నమస్తే తెలంగాణ) /ఏటూరునాగారం: రాష్ట్ర మంత్రులు శుక్రవారం ములుగు జిల్లాలోని కన్నాయి గూడెం మండలం దేవాదుల పంపు హౌస్‌ను సందర్శించనున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఉదయం 9 గంటలకు చేరుకోనున్నారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పంపుహౌస్‌ను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన అనంతరం ప్రాజెక్ట్ ప్రస్తుత పరిస్థితిపై ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. ఏటూరునాగారం మండలకేంద్రంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క పర్యటించనున్నారు. వారు వివిధ అభివృద్ధి పనుల్లో పాల్గొననున్నారు.

బస్వాపూర్‌లో దోపిడీ దొంగల బీభత్సం

- భార్య గొంతుపై కత్తి పెట్టి, భర్త చేతులు కట్టేసి దోపిడీ
- రూ.లక్ష నగదు, 5 తులాల బంగారం, బైక్ అపహరణ
- డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంతో విచారణ చేపట్టిన అడిషనల్ ఎస్పీ

బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న అడిషనల్ ఎస్పీ కిషన్

కాటారం, ఆగస్టు 29 : మండలంలోని బస్వాపూర్‌లో దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. అర్ధరాత్రి పకడ్బందీగా రెక్కీ నిర్వహించి మహిళ గొంతుపై కత్తి పెట్టి గాయపర్చి, ఆమె భర్త చేతులు వెనక్కి కట్టేసి ముగ్గురు దుండగులు దోపిడీ చేశారు. ఎస్సై అభినవ్, బాధితుల కథనం ప్రకారం.. గ్రామంలో పగడాల తిరుపతి, స్వర్ణలత దంపతులు కిరాణా షాపు నడిపిస్తున్నారు. తిరుపతి డీజిల్ కూడా అమ్ముతుండగా లారీల డ్రైవర్లు వచ్చి తీసుకెళ్తారని ఇంటి ముందు బాల్కనీ కింద రాత్రిపూట నిద్రిస్తుంటాడు.ఎప్పటిలాగే బుధవారం రాత్రి నిద్రిస్తుండగా స్వర్ణలత ఇంట్లో పడుకుంది. అర్ధరాత్రి సుమారు 2 గంటలకు స్వర్ణలత వాష్ రూం కోసం బయటికి రాగా ముగ్గురు దుండగులు కనిపించడంతో ఇంట్లో తలుపు వేస్తుండగానే ఆమెపై దాడి చేశారు. అరవడానికి ప్రయత్నించగా గొంతుపై కత్తి పెట్టడంతో కోసుకుపోయి గాయాలపాలైంది. భార్య అరుపులు విన్న తిరుపతి ఇంటి లోపలికి రాగా ఇద్దరు దుండగులు దాడి చేసి నోట్లో గుడ్డలు కుక్కి చేతులు వెనక్కి కట్టేశారు. కత్తులతో బెదిరిస్తూ కొట్టుకుంటూ ఇంట్లో విలువైన నగలు, నగదు విషయమై ప్రశ్నించారు. తనపై పుస్తెలతాడు మాత్రమే ఉందని, అది తీసుకొని తమను చంపకుండా విడిచిపెట్టాలని అభ్యర్థించారు. ఇద్దరు కత్తులతో బెదిరిస్తుండగా మరొకరు ఇంట్లో అన్ని చోట్ల వెతికి రూ.లక్ష నగదు, 5 తులాల బంగారు అభరణాలు, ఇంటి ముందు ఉన్న బైక్‌తో పాటు వారు తెచ్చుకున్న బైక్‌తో పారిపోయారు. వారి వెళ్లిన కొద్ది సేపటికి స్వర్ణలత భర్త చేతుల కట్లు విప్పి బయటికి వచ్చి 100కు డయల్ చేసింది. దీంతో కాటారం పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి దోపిడీ జరిగిన తీరు, వివరాలను తెలుసుకుని బాధిత దంపతులను భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు.

డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో విచారణ

అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, కాటారం క్లూస్ టీంలతో విచారణ ప్రారంభించారు. స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది బస్వాపూర్, కొత్తపల్లి, కొయ్యూర్ తదితర ప్రాంతాల్లో సీసీ పుటేజ్‌లను పరిశీలించారు. బస్వాపూర్ టోల్‌గేట్ వద్ద సీసీ కెమెరాల్లో ముగ్గురు వ్యక్తులు అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న ఆధారాలు లభించినా చిత్రాలు స్పష్టంగా లేకపోవడంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు. కాగా బాధితులు భూపాలపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్ పరామర్శించారు. దొంగల వివరాలు, దోపిడీకి పాల్పడిన తీరును క్షుణ్ణంగా తెలుసుకున్నారు. పోలీసులతో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలిస్తున్నట్లు సీఐ నాగార్జునరావు తెలిపారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

మాట్లాడుతున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, ఆగస్టు 29 : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఆదేశించారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాలోని డీటీడీవో, ఏటీడీవోలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలల వారీగా చర్చించారు. పాఠశాలల్లోని విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా, విద్యార్థుల హాజరు సమస్యలపై పర్యవేక్షించాలన్నారు. ఆర్‌వో ప్లాంట్ల మరమ్మతులు, వంట పాత్రలు ఇతరత్రా వాటిపై నివేదిక అంద జేయాలన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతుల విషయంలో గిరిజన సంక్షేమ కమిషనర్ ఆదేశాలను పాటించాలన్నారు. ఏటూరునాగారంలోని డిగ్రీ కళాశాల, బయ్యారం, కొత్తగూడ, దామరవంచ, పర్వతగిరిలో చేపడుతున్న పాఠశాలల మరమ్మతుల పురగోతిని తెలుసుకున్నారు. సాదిరెడ్డిపల్లి, సీతనగర్, చిన్నబోయినపల్లిలోని ఆశ్రమ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టి పనులను వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ములుగు డిప్యూటీ డైరెక్టర్ పోచం, మహబూబాబాద్ డీడీ మాలోత్ సైదా, వరంగల్ డీటీడీవో సౌజన్య, ఈఈ వీరభద్రం, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఏటీడీవో దేశిరాం, భాస్కర్ పాల్గొన్నారు.

మహిళాశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

మంగపేట,ఆగస్టు 29 : స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం మహిళా శక్తి పథకం కింద అందజేస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీకాంత్ సూచించారు. సెర్ప్ కార్యాలయ ఆవరణలో జ్యోతి మండల సమాఖ్య 19వ వార్షిక మహాసభ గురువారం అధ్యక్షురాలు వట్టం కృష్ణవేణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోతో పాటు, ఏపీఎం అప్పారావు, స్త్రీనిధి ఆర్ఎం అశోక్ హాజరై మాట్లాడారు. మహిళా శక్తి పథకం ద్వారా అమలవుతున్న పాడి గేదెలు, పెరటి కోళ్ల పెంపకం, క్యాంటీన్లు, ఆహార ఉత్పత్తులు, చిన్నచిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక అభివృద్ధిని సాధించాలని సూచించారు. సీసీలు సత్యనారాయణ, సులోచన, మల్లీశ్వరి, జ్యోతి, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డుపై చికెన్ సెంటర్లను తొలగించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ రోడ్డు వరకు ఉన్న చికెన్ సెంటర్లను తొలగించాలని డిమాండ్ చేస్తూ అర్బన్ రజక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అర్బన్ రజక సంఘం అధ్యక్షుడు వైనాల శోభన్ బాబు మాట్లాడుతూ చికెన్ సెంటర్లకు కూరగాయల మార్కెట్లో స్థలం కేటాయించినప్పటికీ ఇక్కడే ఉంటున్నారన్నారు. వర్షాకాలం వచ్చిందంటే అంబేద్కర్ బొమ్మ నుంచి కృష్ణకాలనీ వరకు సైడ్ డ్రైనేజీ లేక నీరంతా షాపుల ముందు చేరి చికెన్ సెంటర్ నుంచి వచ్చే వ్యర్థాలతో దుర్వాస వస్తున్నదన్నారు. వారికి కేటాయించిన స్థలంలో వ్యాపారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. గోపరాజు, చిలకని రమేశ్, ఓరుగంటి లక్ష్మి, కుమార్ ఉన్నారు.

వీసీలో పాల్గొన్న అధికారులు..

ములుగురూరల్, ఆగస్టు 29 : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి హైదరాబాద్ నుంచి గురువారం పంచాయతీ ఓటరు జాబితా రూపకల్పనపై తీసుకోవాల్సిన చర్యలపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ టీఎస్ దివాకర పాల్గొన్నారు. కమిషనర్ సూచించిన పలు అంశాలను, ఆదేశాలను వీక్షించారు. కాన్ఫరెన్స్‌లో సంబంధిత అధికారులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న కలెక్టర్ దివాకర

గణపురం/ కాటారం/ చిట్యాల:/ వెంకటాపురం (నూగూరు)/తాడ్వాయి/వాజేడు/ఏటూరునాగారం/ ములుగురూరల్, ఆగస్టు 29 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టీఎస్ దివాకర హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా క్రీడల ఇన్‌చార్జి అధికారి రవి, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, డీపీఆర్వో రఫిక్, కలెక్టరేట్, క్రీడల శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం, వైస్ ప్రిన్సిపాల్ బాలయ్య, అధ్యాపకులు రాధిక, సరిత, శిరీష, అనిల్‌కుమార్ ఉన్నారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రేణుక, అధ్యాపకులు వెంకటయ్య, సంపత్, నవీన్, జ్యోతి, ఫాతిమా, మున్నీ, వంశీ పాల్గొన్నారు. వాజేడు మండల కేంద్రంలోని స్థానిక నాగారం ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడు బాలాజీ ఆధ్వర్యంలో మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాడ్వాయి మండలంలోని కొడిశాల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలలో ప్రపంచ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతి నిర్వహించారు. హెచ్ఎం దేవదాస్ పాల్గొన్నారు. వెంకటాపురం(నూగూరు) మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా తెలుగు భాష దినోత్సవం నిర్వహించారు. అకాడమిక్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రాజు, అధ్యాపకులు గజ్జి శ్రీనయ్య, ఆదిలక్ష్మి, సుమన్, సంధ్య, రోహిత్‌రెడ్డి, రాంబాబు, గోపాల్ పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గణపురంలోని జడ్పీ పాఠశాల, చెల్పూరు ఎంజీపీ స్కూల్‌లో హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చందర్ చిత్రపటానికి హెచ్ఎం దేసు సతీశ్‌కుమార్, గ్యాదంగి సతీశ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీఈటీ సరిత ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మండలకేంద్రంలోని ఆదర్శ మోడల్ పాఠశాల విద్యార్థులకు మామిడిశెట్టి రవీందర్ స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. ప్రిన్సిపాల్ సుమన్, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, కుమారస్వామి, షకీరాబేగం, రాంబాబు, రమేశ్, శ్రీనివాస్, స్వామి, దేవేందర్, సదానందం, తిరుపతి, సత్యనారాయణ, ముస్తాఖ్, హేమలత పాల్గొన్నారు. కాటారం మండలం మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, కస్తూర్బా విద్యాలయం, గంగారం మోడల్ స్కూల్, పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొండకాయలతో తెలుగు భాషా దినోత్సవం అనే అక్షరాలను రూపొందించారు. ఎస్వో సునీత, హెచ్ఎంలు రవిశంకర్, శ్రీదేవి, ఉమారాణి, ఉపాధ్యాయులు తెలుగు భాష గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమాల్లో కరస్పాండెంట్లు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కవిత, సరిత, రాజేశ్వరి, అరుణ, విజయ, శ్రీలత, నళిని, రాజమణి, లక్ష్మి, స్వప్న, మణిమాల, శిరీష, సుజాత, ఏఎన్ఎం లక్ష్మి, క్రాఫ్ట్ టీచర్ లక్ష్మి పాల్గొన్నారు. చిట్యాల , జూకల్ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో హెచ్ఎంలు శ్రీరాం రఘుపతి, కృష్ణ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. జూకల్ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయులు బుర్ర సదయ్య, సాంబమూర్తి, రాజమౌళి పాల్గొన్నారు.

భూపాలపల్లి పీజీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 29: జిల్లా కేంద్రంలోని పీజీ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జోసఫ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన కళాశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కాలేజీకి సొంత భవనం లేక సింగరేణి పాఠశాలలో రెండు గదులను కేటాయించారని, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దారి కనిపించడంలేదన్నారు. ప్రభుత్వం స్పందించి సొంత భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సబ్జెక్టు బోధించడానికి ఉపాధ్యాయులు కూడా అందుబాటులో లేరన్నారు. పీజీ కళాశాలను తాత్కాలికంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగించాలని ఆయన కోరారు. జిల్లా నాయకులు ఓద్దులే సాకేత్‌రెడ్డి, ఇందారపు అరవింద్, మాతంగి దిలీప్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, ఆగస్టు 29 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రహీల్ సూచించారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కోరకల్ గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. హెల్త్‌అసిస్టెంట్ శ్రీను, ఏఎన్ఎం శారద, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తగా ఉండాలి..

గోవిందరావుపేట : రానున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. గురువారం బుస్సాపూర్ గ్రామంలోని ప్రజలతో ఆయన మాట్లాడారు. వర్షాలు పడిన క్రమంలో వాగులు, కాల్వలు, చెరువులు ఉప్పొంగే అవకాశం ఉందని, ఎవరూ కూడా వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. చేపలు పట్టేందుకు వెళ్లొద్దన్నారు. ఏదేని ప్రమాదం సంభవిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని ఎస్సై వారికి సూచించారు.

నేతకానీల సమస్యలు పరిష్కరించాలి

మంగపేట, ఆగస్టు 29 : నేతకానీ మహార్ కుల స్తుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆ సంఘ మండల కమిటీ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏజన్సీ ప్రాంతంలో గిరిజనులతో మమేకమై జీవిస్తున్న నేతకానీలకు వారితో పాటు సమాన హక్కులు కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, హైదరాబాద్ వేదికగా నేతకానీ భవన్ నిర్మించాలని, విద్యా, ఉద్యోగాల్లో నేతకానీలకు ప్రాధాన్యత కల్పించాలన్న పలు సమస్యలను వినతిపత్రంలో పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు సాంబశివరావు, ఉపాధ్యక్షుడు రాంబాబు, భీం సైనిక్ దళ్ అధ్యక్షుడు నగేశ్, కోశాధికారి శ్రీను, సంయుక్త కార్యదర్శి కే నారాయణ, మండల నాయకులు బాబు, శ్రీను, నాగేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి

గోవిందరావుపేట, ఆగస్టు 29: అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో రుణమాఫీపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ వర్తింపజేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు మండల అధ్యక్షుడు గుండు వెంకటస్వామి, రైతులు సోమ మల్లారెడ్డి, నిమ్మల భిక్షం, కట్ట వెంకటేశ్వర్‌రావు, రాజేశ్, రాజిరెడ్డి, లెనిన్, శ్రీనివాసాచారి, రైతులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలల తనిఖీ

కన్నాయిగూడెం, ఆగస్టు 29 : మండలంలోని గిరిజన పాఠశాలలను డిప్యూటీ డైరెక్టర్ పోచం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తుపాకులగూడెంలోని గిరిజన విద్యా వికాసకేంద్రానికి ఉపాధ్యాయుడు ప్రతిరోజూ రావడంలేదని అక్కడి గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో డీడీ పోచం పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం కన్నాయిగూడెం ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థుల ఆటల పోటీలను వీక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, బాత్ రూంలు విద్యార్థులకు సరిపడా లేకపోవడం, ఉపాధ్యాయులు ఉండడానికి కోటర్స్, గదులు లేవని, పలు విషయాలను డీడీ దృష్టికి తీసుకెళ్లారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ పోచం

అసాంఘిక శక్తులపై అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై తిరుపతిరావు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 29: ఆసాంఘిక శక్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని కలిపాక, పెంకవాగు గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోకి ఎవరైనా అనుమానిత వ్యక్తులు, అపరిచిత వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై రవికుమార్ ఉన్నారు.

ఏవోను నియమించాలి

మహాముత్తారం, ఆగస్టు 29 : మండలానికి వ్యవసాయ అధికారిని నియమించాలని గురువారం రైతులు కోరారు. ఇక్కడ పనిచేసిన ఏవో బదిలీపై పెద్దపల్లి జిల్లాకు వెళ్లారు. ఆయన స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో రుణమాఫీ, పంటసాగుపై అవగాహన సదస్సులు నిర్వహించక ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అధికారులు స్పందించి ఏవోను నియమించాలని కోరారు.

చిరుతపల్లిలో కూలిన ఇల్లు

వివరాలను నమోదు చేసుకుంటున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 29: మండల పరిధిలోని బర్ల గూడెం పంచాయతీ పరిధిలోని చిరుతపల్లిలో గురువారం పూరిళ్లు కూలింది. గ్రామానికి చెందిన అట్టం కృష్ణమూర్తి ఇల్లు కురిసిన భారీ వర్షాని కి కుంగిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ లక్ష్మీరాజయ్య ఘటనా స్థలానికి చేరుకొని ఇల్లు కూలిపోయిన తీరును పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ సహాయం కోసం ఐటీడీఏ పీవోకు నివేదించనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాపురం(నూగూరు), ఆగస్టు 29: మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి సెంటర్ లో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామ స్తుల తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల గ్రామానికి చెందిన అరుణ్ బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా, దుర్గమ్మ గుడి సెంటర్‌లో బైక్ అదుపు తప్పి గుంతలో పడ్డాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు ఆయనను ఆటోలో మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

లెప్రసి కేసులను గుర్తించాలి

ములుగురూరల్, ఆగస్టు 29 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సర్వేలైన్స్ ద్వారా లెప్రసి కేసులను గుర్తిం చాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో లెప్రసి నోడల్ పర్సన్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, మాట్లాడారు. లెప్రసి కేసులను గుర్తించిన వెంటనే ఆరోగ్య కేంద్రంలోని నోడల్ పర్సన్స్‌కు తెలియజేయాలన్నారు. ఈ